క్లుప్తంగా

పల్లె సమస్యలు గుర్తించాలి



శిక్షణ ఇస్తున్న రీసోర్స్‌పర్సన్ రజనీకాంత్

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యదర్శులకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు మాట్లాడుతూ.. పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక కోసం పాఠశాల విద్యార్థులు, మహిళలు, రైతులతో మూడు సార్లు గ్రామసభలు నిర్వహించాలని కోరారు. స్థానికులతో గ్రామసభ నిర్వహించి, గ్రామానికి కావాల్సిన మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి చర్చించి, అవసరమైన సమస్యలను గుర్తించాలన్నారు. 2025 జనవరి నాటికి గ్రామాల్లో సమస్యలను గుర్తించి వివరాలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాజశేఖర్, రిసోర్స్ పర్సన్స్ రజనీకాంత్, ఈశ్వరయ్య, గిరీష్ పాల్గొన్నారు.

యాత్రికులను ఇబ్బంది పెడితే చర్యలు



లాడ్జీల నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే యాత్రికులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని డీఎస్పీ నరసింహమూర్తి హెచ్చరించారు. పట్టణంలోని పలు లాడ్జీలలో యాత్రికుల వద్ద అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు రావడంతో వారిని శుక్రవారం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లాడ్జీల మేనేజర్లు, రూమ్‌బాయ్‌లు, మధ్యవర్తులు ఎవరూ యాత్రికులను ఇబ్బంది పెట్టకూడదన్నారు. లాడ్జీల వద్ద గదుల ధరల వివరాలను ఏర్పాటు చేసి అదే విధంగా అద్దెకు ఇవ్వాలని తెలిపారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ గోపి, పోలీసులు పాల్గొన్నారు.

ప్రణాళికతో పంచాయతీల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

సత్యవేడు : గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా పంచాయతీల్లో అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, సంఘమిత్రలు, ఆరోగ్య సిబ్బంది, వీఓఏలకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. పంచాయతీలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక నిధులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులను సమీకరించి వాటికి అనుగుణంగా 2024–25 ప్రణాళికలు తయారు చేయాలన్నారు. గ్రామాభివృద్ధిలో గ్రామపెద్దలు, సామాజిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలందరినీ భాగస్వామ్యులను చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ తరుణాక్ష రెడ్డి, ఎంఈఓ రవి, ఎంపీహెచ్ఈఓ సుబ్రహ్మణ్యం , రిసోర్సు పర్సన్‌లు హరీష్, లోకేష్, రాజేష్, సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి : పట్టణంలోని భాస్కరపేటలో వెలసిన చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం భక్తులకు అన్నదానం చేశారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పులి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేదోక్తంగా ఊంజల్‌సేవ



స్వామి అమ్మవార్ల పూజల్లో ఈవో, అధికారులు

శ్రీకాళహస్తి : కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం రాత్రి స్వామి అమ్మవార్ల ఊంజల్‌సేవ వేదోక్తంగా జరిగింది. స్వామి అమ్మవార్లకు ఆలయ అలంకార మండపంలో అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలోఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నిరుపయోగంగా దోబీఘాట్

రజక జీవనం.. సమస్యలమయం

రజకులకు దోబీఘాట్‌లు, నీటి వసతి లేక పోవడంతో సమస్యల జీవనం గడుపుతున్నారు. బతుకుతెరువు కోసం పెద్దలు నేర్పిన కులవృత్తి నేడు భారమవుతోందని సత్యవేడు రజకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుస్తుల శుభ్రతకు అవసరమయ్యే సర్ఫ్ పొడరు, ఇస్త్రీ చేయడానికి కావాల్సిన బొగ్గులు, విద్యుత్ చార్జీల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దోబీఘాట్‌లో సౌకర్యాలు కరువై రజకులు అవస్థలు పడుతున్నారు. కనీసం నీటి వసతి కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు.

– సత్యవేడు

- దోబీఘాట్‌లో సౌకర్యాలు కరువు

1987లో రజకుల కోసం ఉళవచేను సమీపంలో దోబీఘాట్ నిర్మించి బోరు మోటారు అమర్చారు. నాలుగు సంవత్సరాలకే మరమ్మతులకు గురైన మోటారు మరమ్మతులకు నోచుకోక తుప్పపట్టి పాడైపోయింది. నీటి వసతి లేక పోవడంతో ఆనాటి నుంచి దోబీఘాట్ నిరుపయోగంగా మారింది. దీంతో చెరువుల వద్ద దుస్తులు ఉతకడం మొదలు పెట్టారు. సత్యవేడులోని చెరువు మధ్యలో తెలుగుగంగ కాలువ తవ్వేశారు. కొద్దిపాటి నీటి వనరుగా ఉన్న చెరువును కూడా కోల్పోయారు. పట్టణపరిధిలో 100 కుటుంబాలకు పైగా రజకులు ఉన్నారు. మండల పరిధిలో 300 పైగా కుటుంబాలు ఉన్నాయి. ప్రస్తుతం గ్రామాల్లోని చెరువులు, కాలువలు, వంకల వద్ద దుస్తులను ఆయా కుటుంబాల భార్యాభర్తలు వెళ్లి ఉతుక్కుంటూ జీవనం సాగిస్తున్నారు. వేసవి ప్రారంభంలోనే సత్యవేడులో చెరువులు అడుగంటుతున్నాయి. దీంతో నీటి కోసం తిప్పలు తప్పడం లేదు. కొందరు దూర ప్రాంతాలు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి ఉతికి తీసుకొస్తున్నారు. మరికొందరు మహిళలు పంచాయతీలు సరఫరా చేస్తున్న నీటిని భర్తలకు అందించి దుస్తులు శుభ్రం చేస్తున్నారు. మరి కొందరు గంగ కాలువ ఊటనీటిలో ప్రయాసలకోర్చి ఉతుకుతున్నారు.



గంగ కాలువ సమీపంలో దుస్తులు ఉతుకుతున్న మహిళ



పూడిన బావి

పెరిగిన ధరలు

బొగ్గుల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో రోజంతా పనిచేసి కష్టపడిన వచ్చే డబ్బులు వాటి కొనుగోలుకే సరిపోతుందని వాపోతున్నారు. ఉన్న పనిని వదులుకోలేక దుర్భర జీవితాలు గడుపుతున్నారు. సత్యవేడులోని దోబీఘాట్ ఆక్రమణలకు గురైంది. పలువురు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ద్వారా రజకులకు అవసరమైన సామగ్రిని సబ్సిడీ ధరలతో అందించాలని రజకులు కోరుతున్నారు.

కొత్తగా దోబీఘాట్ నిర్మించాలి



నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడు పట్టణంలోని జంటకోనేరు సమీపంలో నూతనంగా దోబీఘాట్ నిర్మించాలి. దుస్తులు ఉతకడానికి నీటి వసతి కూడా ఉంటుంది. ప్రజాప్రతినిధులు రజకుల అభివృద్ధికి సహరించాలి. – సుబ్రమణ్యం, కొత్తమారి కుప్పం

దుస్తులు ఉతకడం మానేశా..



నీటి వసతి లేకపోవడంతో గుడ్డలు ఉతకడం మానేశాను. బండిపై ఇస్త్రీ పెట్టి పెట్టుకున్నాను. ఉతికిన బట్టలు తెచ్చే వారికి ఇస్త్రీ చేసి ఇస్తున్నాను. రోజు కూలీ కూడా గిట్టడం లేదు. కుల వృత్తిని వదులు కోలేక ఇబ్బందులు పడుతున్నాను. – మనోహర్, సత్యవేడు



అయ్యప్ప పూజలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఘనంగా అయ్యప్ప పడిపూజ

శ్రీకాళహస్తి : పట్టణంలోని భేరివారి మండపం వద్ద ఉత్తరాజీ శరనణ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడిపూజ జరిగింది. ఈ పూజకు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి , పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. కార్యక్రమంలో సురేష్, ఆశాకిరణ్, పెరుమాళ్, యశ్వంత్‌రెడ్డి, బాల, కిరణ్, హర్ష, గోకుల్, శరవణ, శ్రీను పాల్గొన్నారు.

సర్పంచుల బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసాద్

వరదయ్యపాళెం: పంచాయతీల్లో సర్పంచుల బాధ్యతలు, హక్కుల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ముందస్తు ప్రణాళికతో ముందుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్డీ చిరంజీవి, ఏపీఎం సీతారాం, ఏపీఓ గణేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నీలిమ పాల్గొన్నారు.

ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

శ్రీకాళహస్తి : పట్టణ పేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ, ఏఐటీయూసీ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేయాలన్నారు. లేకపోతే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. పల్లెల్లో పేదలకు మూడు సెంట్లు, పట్టణ పేదలకు రెండు సెంట్ల చొప్పున స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి అవసరమైన వాటిని ప్రభుత్వమే సమకూర్చాలన్నారు. అదే విధంగా ఆ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ఇక కేంద్ర ప్రభుత్వ విధానాలను ఆయన ఎండగట్టారు. 18న సచివాలయాల వద్ద పేదలను సమీకరించి ఇళ్ల కోసం పోరాటం చేయాలన్నారు. 26న కలెక్టరేట్ కార్యాలయం వద్ద జరిగే రైతు ఆందోళనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, గురవయ్య, తుల సీరాజ్, శివకుమార్, కార్తీక్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని ఈబీసీ కాలనీలో శుక్రవారం సీపీఐ మండల కార్యదర్శి ధర్మయ్య ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు ఈనెల 18వ తేదీన సచివాలయాల వద్ద ధర్నాను విజయవంతం చేయాలనే కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చిన పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలను అర్హులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

18న సచివాలయాల ఎదుట ఆందోళనలు

నాగలాపురం : పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇవ్వాలని ఇంటి నిర్మాణం కోసం 5 లక్షలు, పక్కా ఇళ్ల ప్రభుత్వం మంజూరు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో 18వ తేదీ సచివాలయాల ఎదుట ఆందోళనలకు పిలుపునిచ్చారు. శుక్రవారం పిచ్చాటూరు ఆర్టీసీ బస్టాండు వద్ద ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు అన్నదొరై, సుభాష్ మాట్లాడుతూ..అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షలు, ఉచితంగా ఇసుక ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. పేదలకు ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మునిచంద్ర, మునివేలు , సుకుమార్, ప్రభాకరన్ పాల్గొన్నారు.

కుంభాభిషేక ఉత్సవాలు ప్రారంభం



అలంకరణలో స్వామి అమ్మవార్ల విగ్రహాలు

వరదయ్యపాళెం : మండలంలోని చిన్న పాండూరు వడ్డిపాళెంలో నూతనంగా నిర్మించిన శ్రీ భూమి నీలాదేవి సమేత శ్రీనివాసస్వామి ఆలయంలో కుంభాభిషేక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం ఆలయంలో ప్రతిష్ఠించనున్న స్వామి అమ్మవార్ల విగ్రహాలకు మహా సంప్రోక్షణ సంకల్ప పూజలు నిర్వహించారు. అలాగే శనివారం తెల్లవారుజామున నూతన ఆలయంలో విగ్రహ , కలశ స్థాపన, మహాకుంభాభిషేక ఉత్సవం జరగనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శంకరాచార్యులు తెలిపారు.

గురుకులంలో వైద్య శిబిరం కొనసాగించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: ఎంజేపీఏపీ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం మరో రెండు రోజులు కొనసాగించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్లను కోరారు. గురువారం ఎమ్మెల్యే సత్యవేడు వైద్యశాలలో జ్వరంతో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. అందరికీ జ్వరం తగ్గిందని డాక్టర్ సురేష్ తెలిపారు. సాయంత్రం పిల్లలందర్నీ డిచ్చార్జి చేస్తున్నామన్నారు. అనంతరం గురుకుల పాఠశాల హాస్టల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. తానూ ఈ హాస్టల్ విద్యార్థినేనని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు, నర్సులు తమ సొంత బిడ్డల్లా హాస్టల్‌లో ఉన్న పిల్లలను చూసుకోవాలని సూచించారు. దూరప్రాంతాల ప్రజలు పిల్లలు ఇక్కడ చదువుతున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. భోజనశాలకిరువైపుల జేసీబీతో పిచ్చిమొక్కల తొలగింపు పనులను పరిశీలించారు. హాస్టల్ పరిసరాల్లో దోమలు ప్రబల కుండా ఫాగింగ్ చేయించాలని పంచాయతీ సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఎస్.చంద్రశేఖర్, ఎంఈఓలు కే.రవి, ఉషా తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన



సరస్వతిదేవికి పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ముందుగా సరస్వతిదేవికి పూజలు నిర్వహించారు. అనంతరం పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. పలు పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ పుస్తక ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా శుక్రవారం రేణిగుంట గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి శ్రీముఖి ఆధ్వర్యంలో పోటీ పరీక్షలు, పురాణ, ఇతిహాసాలకు సంబంధించిన పుస్తకాలు ప్రదర్శనకు ఉంచారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.శర్మ పాల్గొని గ్రంథాలయాలను వినియోగించుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడికి సతీ వియోగం

- నివాళులర్పించిన మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి



సుజాతమ్మకు భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నారాయణస్వామి



నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

నాగలాపురం : వైస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు సతీమణి సుజాత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గూడూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. సమాచారం అందుకున్న మాజీ డిప్యూటీ సీఎం కలత్తూరు నారాయణ స్వామి, నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ కలిసి అపరంజిరాజు స్వగృహానికి చేరుకుని సుజాతమ్మకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సీనియర్ నాయకులు బీరేంద్రవర్మ, చిన్నదొరై, శ్యామ్, మోహన్ మొదలియార్, దేశప్పన్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానం అమలు చేయాలి

సత్యవేడు : ప్రభుత్వంలో విలీనమైన ఆర్టీసీ ఉద్యోగులకు పాత పింఛను విధానం అమలు చేయాలని నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బీఎస్ బాబు కోరారు. శుక్రవారం సత్యవేడు ఆర్టీసీ ఎన్ఎంయూ కార్మికుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. లాభాల్లో నడుస్తున్న అనేక సర్వీసులను మేనేజ్‌మెంట్ ఏక పక్షంగా సంబంధం లేని కారణాలు చూపి రద్దు చేసిందని జిల్లా కార్యదర్శి బీఎస్ బాబు ఆరోపించారు. రద్దు చేసిన సర్వీసులు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిపో నూతన కమిటీ అధ్యక్షుడిగా పార్థసారథి, కార్యదర్శిగా బాబు, గ్యారేజ్ అధ్యక్షుడిగా కుప్పయ్య, శేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చెంచులయ్య, పెరుమాళ్, కుమార్ గుణ శేఖర్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు పరామర్శ



సత్యవేడు వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించిన నూకతోటి రాజేష్

సత్యవేడు : బీసీ గురుకుల పాఠశాలలో 56 మంది విద్యార్థులు జ్వరంతో ఆస్పత్రికి చేరడంతో శుక్రవారం సత్యవేడు వైద్యశాలకు వచ్చి అక్కడ చికిత్స పొందుతున్న విద్యార్థులను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పరామర్శించారు. జ్వరం బారిన పడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించిన కమ్యూనిటీ వైద్యశాల, పీహెచ్‌సీ వైద్యులను ఆయన అభినందించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బీరేంద్ర వర్మ ,భానుప్రకాష్ రెడ్డి, జిల్లా , మండల కన్వీనర్ సునీల్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, సత్యవేడు జేసీఎస్ కన్వీనర్, వేలూరు రాకేష్, రమేష్, నియోజకవర్గ మహిళా కార్యదర్శి మస్తానీ, గోవిందస్వామి, పునిద కుమార్, సర్పంచులు శేఖర్, శ్రీరాములు రెడ్డి, ఎంపీరవి, మునివేలు, సెంథిల్ పాల్గొన్నారు.

భారీ వాహనాలతో ట్రాఫిక్ కష్టాలు





పట్టణంలోకి వచ్చిన లారీ, భేరివారి మండపం వద్ద వన్‌వే ఉన్నా, ఎదురుగా ఆటో వెళుతున్న దృశ్యం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలో ఉదయం 8 గంటల లోపు భారీ వాహనాలు పట్టణంలోకి ప్రవేశించడం నిషేధం. అయితే ఉదయం 9 గంటల అయినా లారీలు పట్టణంలోకి ప్రవేశించి దుకాణాల వద్ద సరుకులను దించడం జరుగుతోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సరుకు రవాణా వాహనాలతో ట్రాఫిక్ స్తంభించిపోవడంతో ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి భారీ వాహనాలను పట్టణంలోకి ప్రవేశించకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వరిలో కాలిబాటలతో ప్రయోజనం



సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం అధికారి శ్రీనివాస్

వరదయ్యపాళెం : రబీ సీజన్‌లో వరినాట్లు వేస్తున్న రైతులు కాలిబాటలు ఏర్పాటు చేసుకోవడంతో సుడిదోమను నియంత్రించడంతో పాటు ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయడం సులభతరంగా ఉంటుందని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం వరదయ్యపాళెంలో నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎరువులు వినియోగించాలని కోరారు. అధిక ఎరువుల వినియోగంతో పంటలకు నష్టదాయకం అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ విస్తరణ అధికారి రవి, వ్యవసాయ సహాయకులు పవన్, సుమన్ పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక శోభ



శ్రీకాళహస్తి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

శ్రీకాళహస్తి : కార్తీక మాసం శుక్రవారం పౌర్ణమి సందర్భంగా భక్తులు ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించారు. శుక్రవారం సాయంత్రం పౌర్ణమి ఘడియలు ప్రారంభం అవుతున్న సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రాంగణంలో మహిళలు అత్యధిక సంఖ్యలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

వరదయ్యపాళెం : మండలంలోని జ్యోతీశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ అర్చకులు నిరంజనాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో పెద్ద సంఖ్యంలో కార్తీక దీపాలు వెలిగించారు.

నారాయణవనం : కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని శైవ క్షేత్రాలను భక్తులు దర్శించుకుని, పిండి దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కైలాస కోన జలపాతంలో కామాక్షాంబిక, కైలాసనాథున్ని దర్శించుకున్నారు. సింగిరికోనలో శ్రీదేవీ, భూదేవీ సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మహాలక్ష్మి, ధన్వంతరి హోమాలు చేపట్టి సాయంత్రం ఉత్సవ మూర్తులకు ఊంజల్‌సేవ నిర్వహించారు. స్థానిక సారకాయలస్వామి ఆలయం, పాలమంగళం పాలీశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



గుడిమల్లం ఆలయానికి లక్ష బిల్వ పత్రాలను తీసుకెళుతున్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని ఆలయాల్లో కార్తీక దీపోత్సవాలు నిర్వహించారు. గాజులపెళ్లూరు శివాలయం, బుచ్చినాయుడుకండ్రిగలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి, పచ్చాలమ్మదేవత, అభయ ఆంజనేయస్వామి ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు.

రేణిగుంట : మండలంలోని గాజులమండ్యంలోని శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధ్వజస్తంభం, ఉసిరి చెట్టు వద్ద మహిళలు కార్తీకదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ● ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరాలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్ష బిల్వార్చన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ బత్తల గిరిబాబు, అయ్యప్ప స్వాములు, మహిళలు ఊరేగింపుగా లక్ష బిల్వ పత్రాలను ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేసి స్వామి వారికి సమర్పించారు.